ఇంకెన్నాళ్లు ఇన్‌చార్జీల సేవలు?

- పూర్తి స్థాయి అధికారులు లేక ప్రజల ఇబ్బందులు
- పెగడపల్లి మండలానికి ఇన్‌చార్జి అధికారులే దిక్కు
- శాఖలపై కొరవడిన పర్యవేక్షణ


పెగడపల్లిలోని పశువైద్య కేంద్రం

పెగడపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ శాఖలకు ఇన్‌చార్జి అధికారుల సేవలే కొనసాగుతున్నాయి. పెగడపల్లి మండలంలోని ప్రధాన శాఖలు విద్య, వ్యవసాయం, వైద్యశాఖలకు ఏళ్ల తరబడి అధికారులంతా ఇన్‌చార్జీలే కావడం గమనార్హం. మండలంలో విద్యా, వ్యవసాయం, వైద్యశాఖలకు ఇన్‌చార్జీలే దిక్కయ్యారు. విద్యాశాఖకు మల్యాల ఎంఈవోగా ఉన్న శ్రీనివాస్, వ్యవసాయశాఖకు జగిత్యాల ఏవో వినీల, వైద్యశాఖకు కొడిమ్యాల మండలంలో ఉన్న శ్రీకాంత్ ఇన్‌చార్జీలుగా కొనసాగుతున్నారు. మండలంలో ప్రజలు ఎక్కువ శాతం వ్యవసాయం సాగు చేస్తారు. దీంతో పంటల సాగు సమయంలో వారికి కావాల్సిన సలహాలు, సూచనలు అందించే ఏవో లేక పోవడంతో వారికి తెలిసీ తెలియని పంటలనే సాగు చేస్తూ ఆశించిన దిగుబడి పొందలేక పోతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. ఏఈవోలు ఇస్తున్న సూచనలతోనే సరిపెట్టు కోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. పూర్తిస్థాయి ఎంఈవో లేక పాఠశాలల పర్యవేక్షణ కొరవడి విద్యా వ్యవస్థ కుంటుపడి పోతుంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడం, విద్యా వ్యవస్థ పటిష్టత కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్న ఏమి ఫలితమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఇన్‌చార్జీగా ఉన్న ఎంఈవోకు రెండు మూడు మండలాలు ఇన్‌చార్జీ బాధ్యతలు ఉండటంతో పాలనపరంగా ఆయన సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడి పలువురు ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. రెండేళ్ల క్రితం మండల పశువైద్యాధికారి విక్రమ్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొడిమ్యాల మండలంలో ఉన్న శ్రీకాంత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. మండలంలో ఎక్కడ కూడా పశు వైద్య ఉప కేంద్రాలు లేవు. మండల కేంద్రంలో ఉన్న ప్రధాన పశువైద్యశాలనే రైతులకు దిక్కుగా మారింది. మారుమూల గ్రామాల పశువులు వ్యాధుల బారిన పడితే మండల కేంద్రంలోని పశు వైద్యశాలకు తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. చికిత్స చేసేందుకు సమయానికి పశువైద్యుడు అందుబాటులో లేకపోతే వెటర్నరీ అసిస్టెంట్ దిక్కు అవుతున్నాడు. కొన్ని సందర్భాల్లో పశువులకు వ్యాధి ముదిరి మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి. మండలంలోని కీలక శాఖలకు పూర్తిస్థాయి అధికారులను నియమించాలని ప్రభుత్వాన్ని, సంబంధిత ఉన్నతాధికారులను మండల ప్రజల కోరుతున్నారు.

ఎంఈవోను నియమించాలి



మండల పూర్తిస్థాయి ఎంఈవో లేక ఉపాధ్యాయులపై పర్యవేక్షణ కరువైంది. సర్కారు బడుల బలోపేతం చేస్తూనే విద్యా వ్యవస్థను పటిష్టత కోసం ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్న ఫలితం లేక పోతోంది. ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడాలంటే మండలానికి పూర్తి స్థాయి ఎంఈవో ఉండాల్సిందే.

– తాటిపర్తి కృష్ణారెడ్డి బతికపల్లి

సలహాలు, సూచనలు లేవు



ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమైంది. వ్యవసాయ పనులు షురువయ్యాయి. సాగుచేసే పంటలపై వ్యవసాయ అధికారుల సూచనలు రైతులకు తప్పనిసరి. పూర్తి స్థాయి ఏవో లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఏఈవోలు ఇస్తున్న సూచనలు, సలహాలతోనే రైతులు సరిపెట్టుకుంటున్నారు. రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరుతున్నారు.

– పల్లె మోహన్‌రెడ్డి నామాపూర్

అధికారులను నియమించాలి



రెండు చోట్ల పశువైద్యాధికారి ఒక్కరే విధులు నిర్వహిస్తుండటంతో ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదు. పశువులకు వైద్యం చేసేందుకు గ్రామాల్లో ఉప కేంద్రాలు లేవు. దీంతో మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాలకు రావాల్సి వస్తోంది. దీంతో తీరా సమయానికి డాక్టర్ అందుబాటులో లేకపోతే నిరాశకు గురికావాల్సి వస్తోంది. పూర్తిస్థాయి అధికారిని నియమించాలి.

– భూమాడి గంగారెడ్డి పెగడపల్లి

క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పరిసరాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

జగిత్యాల: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శుక్రవారం పలు కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా వంటివి ప్రబలుతాయని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నామని, మనం ఇళ్లలో వాడే కుండీల్లోని నీటిని రెండు రోజులకోసారి మార్చుకోవాలని, అలాగే ఖాళీ స్థలాల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదని, కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వస్తువులు ఇళ్ల పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్మికులు నిత్యం డ్రైయినేజీలు, మురికికాలువలను శుభ్రం చేయాలని, ఎక్కడ చెత్త కన్పించకూడదని, ఎప్పటికప్పుడు డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. ఆమె వెంట అధికారులున్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత


అక్రమ కట్టడాలు కూల్చేయిస్తున్న అధికారులు

కోరుట్ల: పట్టణంలోని మద్దుల చెరువులో అక్రమ నిర్మాణాలను అధికారులు శుక్రవారం కూల్చి వేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చెరువులో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాలకు నోటీసులు జారీ చేసి ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, అధికారులు పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్ జేసీబీలతో కూల్చివేశారు. కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఏవో దీపిక

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి దీపిక శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని యామాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, తిమ్మాపూర్, డబ్బా గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, రశీదు పుస్తకాలను పరిశీలించి ప్రతి రైతు, ఎరువులు, విత్తనాలు కొన్న వెంటనే తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆయా షాపుల యాజమానులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే చిన్నారుల ఎదుగుదల


చిన్నారుల ఎత్తును పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

రాయికల్: పౌష్టికాహారంతోనే చిన్నారుల ఎదుగుదల ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువు, ఎత్తులు కొలిచారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులకు బరువు, ఎత్తులు కొలిచి వారి స్థితులను తల్లులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, సువర్ణ, సుజాత, సహార, బుజ్జమ్మ, అనురాధ పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

రాయికల్: మండలంలోని దావన్‌పల్లి గ్రామానికి చెందిన మాలోతు లక్ష్మి, ధర్మాజీపేట గ్రామానికి చెందిన లావుడ్య నాగరాజు, లావుడ్య గంగాధర్‌ను ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ శుక్రవారం తహసీల్దార్ ఖయ్యూం ఎదుట బైండోవర్ చేశారు. గుడుంబా తయారుచేసినా, విక్రయించినా రూ.లక్ష జరిమానా, జైలుశిక్ష విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై రాజేందర్, కానిస్టేబుల్ మమత, అబ్దుల్లా పాల్గొన్నారు.

గంజాయి, గుడుంబాను అరికడతాం

ఇబ్రహీంపట్నం: మెట్‌పల్లి సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో గంజాయి, గుడుంబా, డ్రగ్స్‌ను అరికడతామని సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. గుడుంబా తయారు చేసినా, అమ్మినా, గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించినా, వీడీసీ ఆధ్వర్యంలో బెల్ట్‌షాపుల నిర్వహణకు, పెట్రోల్, చికెన్, కూల్‌డ్రింక్స్ అమ్మకాలకు వేలం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గోదావరినది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తే ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు. మహిళలు, విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని వివరించారు. పోలీస్‌స్టేషన్‌కు ఎవైనా ఫిర్యాదు చేయడానికి వస్తే నేరుగా రావాలని, మధ్యవర్తులతో రావద్దని సూచించారు. సీఐ వెంట ఎస్సై ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

జగిత్యాల: పర్యావరణాన్ని కాపాడటం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ హిత ఉత్పత్తులపై తమవంతు బాధ్యతగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలకు గతంలో హరితమిత్ర అవార్డు వచ్చిందని, ఎక్కువగా పండ్లు, మొక్కలు నాటాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ ఎల్లబెత్‌రాణి, వైస్ ప్రిన్సిపాల్ కరుణాకర్, రాధకృష్ణ, రాజేశం,లక్ష్మణ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలిగా శారద



జగిత్యాల: మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జగిత్యాల మండల అధ్యక్షురాలిగా శారద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వెన్న మహేశ్, ఉపాధ్యక్షురాలిగా కట్ట శారద, ప్రధాన కార్యదర్శిగా సమీర్, కోశాధికారిగా జమున ఎన్నికయ్యారు.

ఎర్రవెల్లికి తరలిన బీఆర్‌ఎస్ నాయకులు


కేటీఆర్‌తో రాయికల్ బీఆర్‌ఎస్ మహిళలు

రాయికల్: ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన బీఆర్‌ఎస్ సమావేశానికి శుక్రవారం మండల బీఆర్‌ఎస్ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎనగందుల ఉదయశ్రీ, అల్లీపూర్ ఎంపీటీసీ మోర విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవెల్లి సమావేశానికి బీఆర్‌ఎస్ నాయకుల దుమ్మా

రాయికల్: ఎర్రవెల్లిలో మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీఆర్‌ఎస్ కార్యకర్తల ముఖ్య సమావేశానికి రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు, మండలానికి చెందిన సీనియర్ నాయకులు గైర్హాజరు కావడంతో వీరంతా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ వర్గాల్లో చర్చించుకుంటున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి హైస్కూల్‌లో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2001–02 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఆనాడు పాఠశాలలో చేసిన అల్లరినిగుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మచ్చ గంగాధర్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలే ముద్దు


మాట్లాడుతున్న అశ్విని

జగిత్యాల: ఆడపిల్ల అనగానే భారంగా భావిస్తున్నారని, ఆడపిల్లలే ముద్దు అని మహిళ సాధికారత కోఆర్డినేటర్ అశ్విని అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లింగ నిర్ధారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లింగ నిర్ధారణ నిషేధమని, ఒకవేళ ఎవరైనా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా జరిగినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మహిళల సంక్షేమం కోసం 100, 181, 1098, 14567 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ చైతన్య, వేణు, గౌతమి, స్వప్న, హేమశ్రీ పాల్గొన్నారు.

మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

కోరుట్ల: పట్టణంలో శుక్రవారం ఉదయం మున్సిపాలిటీ ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో మల్లయ్య అనే పారిశుధ్య కార్మికుడికి స్వల్ప గాయాలయ్యాయి. పట్టణంలోని జాతీయ రహదారిపై చెత్త సేకరిస్తున్న క్రమంలో జగిత్యాల వైపుకు వెళ్తున్న లారీ ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టటంతో ట్రాక్టర్ ట్రాలీ పల్టీ కొట్టింది. మున్సిపల్ కార్మికుడికి స్వల్ప గాయాలయ్యాయి.

గ్రామాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీ

కథలాపూర్: మండలంలోని కలిగోట, పోతారం గ్రామాల్లో శుక్రవారం ఎక్సైజ్ శాఖ మెట్‌పెల్లి ఎస్సై లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాల విషయంలో అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఆయా గ్రామాల్లో అక్రమంగా మద్యం బెల్ట్‌షాపుల నిర్వాహణపై ఆరా తీశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట అబ్కారీశాఖ సిబ్బంది వాహిద్ తదితరులు ఉన్నారు.

పైపులైన్ లీకేజీతో నీరు వృథా



మెట్‌పల్లి: పట్టణ శివారులోని అర్బన్ హౌజింగ్ కాలనీ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయి భారీగా నీరు వృథాగా పోతోంది. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని మరమ్మతులు చేపట్టారు.

పోటాపోటీగా ఫ్లెక్సీలు



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి మద్దతుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జగిత్యాల: జగిత్యాలలో ఫ్లెక్సీలు పోటాపోటీగా వెలుస్తున్నాయి. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడంతో జిల్లాలో పొలిటికల్ హీట్‌గా మారింది. ఎమ్మెల్యేకు మద్దతుగా కొత్తబస్టాండ్ చౌరస్తాలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా, దానిపైనే జగిత్యాల అంటే జీవన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి అంటేనే జగిత్యాల అంటూ మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఏమైందో తెలియదు కానీ మళ్లీ దానిని తీసి వేరే చోట ఏర్పాటు చేశారు. దీంతో వర్గపోరు మొదలైందని స్థానికంగా జోరుగా చర్చ జరుగుతోంది.


ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఘనంగా పీవీ నర్సింహారావు జయంతి


కోరుట్లలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల రూరల్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో పీవీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశ ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కొంతం రాజం, కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెరుమండ్ల సత్యనారాయణ గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, పూదరి నర్సాగౌడ్, తుమ్మనపల్లి రాంప్రసాద్, సంతోష్‌రెడ్డి, ఉల్లేందుల రమేశ్, నాయిని సురేశ్ ఉన్నారు.

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో శుక్రవారం పీవీ నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ బి.లావణ్య పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పీవీ నరసింహారావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించుటలో నిరంతరం పట్టుదల కృషితో ముందుకెళ్లాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, అంజలి, అలేఖ్య, జగదీశ్, శ్రీధర్, సత్యానందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీకొని నలుగురికి గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ మీనయ్య

ధర్మపురి: ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని నేరెళ్ల జాతీయ రహదారి వద్ద శుక్రవారం రాత్రి ఎదురుగా వస్తున్న ఆటో, బైకులు ఢీకొన్నాయి. బైకుపై వెళ్తున్న నేరెళ్లకు చెందిన పాదం మీనయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న అంజయ్య, భారత్ బాయ్‌లకు స్వల్పగాయాలు కాగా, ఎండీ చాంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 అంబులెన్సులో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈఎన్‌టీ సరిత, ఫలెట్ రవీందర్ క్షతగాత్రులకు ప్రతమ చికిత్స చేశారు.

ఒకరిపై దాడి కేసు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో ఆరె గంగరాజంపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి చింతకుంట గ్రామశివారు నుంచి ఇంటికి చేరుకుంటున్న తరుణంలో సోమ ప్రవీణ్‌పై ఆరె గంగరాజం దాడికి పాల్పడటంతో గాయాలపాలయ్యారు. బాధితుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు గంగరాజంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

మెట్‌పల్లి: సర్కిల్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడ్డ ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలో సాయంత్రం సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. మహారాష్ట్రకు చెందిన కరణ్ మరిభాదోత్రె, సురేష్ అశోక్ పవార్‌లు అనుమానస్పదంగా కనిపించడంతో పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తీసుకపోయి విచారించగా, హన్మంతు పవార్ అనే వ్యక్తితో కలిసి గతంలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వెల్లుల్ల గ్రామంలోని పోచంపల్లి లక్ష్మి ఇంట్లో ఐదు తులాల బంగారం, వెండి వస్తువులు, పట్టణంలోని హన్మాన్‌నగర్‌కు చెందిన బాస రుద్రయ్య ఇంట్లో పది తులాల బంగారం, ఒక సెల్‌ఫోన్ అపహరించినట్లు చెప్పారు. ఈ మేరకు వారి నుంచి రూ.5వేల నగదుతో పాటు దొంగతనాలకు ఉపయోగించే రెండు ఇనుప కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని చాకచక్యంగా పట్టుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవిలను డీఎస్పీ అభినందించారు.

30న మెట్‌పల్లిలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 30 న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి శుక్రవారం తెలిపారు. అండర్–8,10,12 విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 9 గంటలకు నేరుగా హాజరు కావాలని సూచించారు.

ఘనంగా మహాలక్ష్మి బోనాలు


తిప్పన్నపేటలో బోనాలతో వస్తున్న మహిళలు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలు నెత్తిన ఎత్తుకుని డప్పుల చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి మహాలక్ష్మి ఆలయంలో బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి మొక్కులు


వేములకుర్తిలో భక్తుల పూజలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి 16 కులసంఘాల సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా మొక్కులు చెల్లించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అమ్మవారికి, పూజ సామగ్రిని, చీర, సారేలు, డప్పుచప్పుల మధ్య గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గోల్లెం, పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామశివారులోని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి అధ్యక్షుడు ఎడిపెల్లి గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు గొడిసెల భూమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.